# నర్తించే పాదాలు

ఎ. వి. మంగపతిరావు

**వెండి తీగల్లా** ఉన్న పలిత కేశాలను రెండు చేతులతో చెవుల వెనక్కు నెట్టుకుంటూ, ఎడమచేత కనురెప్పలు అదుముకుని ఒక క్షణం ఆగి నర్తన వైపు తల తిప్పాడు ధర్మతేజ.

"నాట్యశాస్త్ర ప్రకారం నృత్యం తీర్మానించడమంటే కొన్ని పద్ధతులూ, నియమ నిబంధనలూ ఉన్నాయి, నర్తనా! ఆ నాట్య ధర్మాన్ని పాటించిన నాడే నీవు నే వాశించిన కళాకారిణివి కాగలవు. తప్ప ఏకాగ్రతా రహితమై నాలుగడుగులు వేసినంతమాత్రాన నీవు నర్తకివి కాలేవు. నీ పేరులో ఉన్న నర్తన నీ పాదాల లోకి రాదు."

గంభీరమైన ధర్మతేజ స్వరం లోని అధికారానికి నర్తన పెదవులు తడి ఆరాయి. గుండె దడ హెచ్చింది. విహ్వలమైన చేతులు గుండె కానించుకుని తల ఎత్తే ధైర్యం చేయకుండా నిలబడి పోయింది, శిలలా.

"ప్రారంభ దశలో తప్పులు చేయటం ఎవరికైనా సహజమే కావచ్చు, నర్తనా. కాని నీ విషయంలో అలా కాకూడదు. నీవు తప్పన్నది చేయకూడదు. మరుగున పడిపోతున్న ఈ నాట్యకళకు వూపిరి కావాలనుకున్న ఆ నాటి నా మంజీరలా నీవు ఆడాలి, నర్తనా!"

దగ్గరగా నడిచి తల ఎత్తని ఆమె చుబుకం కింద చూపుడు వేలుంచి ఆర్ద్రంగా ముఖాన్ని తన వైపుకు తిప్పుకున్నాడు ధర్మతేజ.

పొద్దుతిరుగుడు పువ్వులా తిరిగింది నర్తన. కలువ రేకులై విచ్చుకున్నాయి కళ్ళు.

గదిలోని వాతావరణం గంభీరతతో గడుస్తూంది. దూరాన గూళ్ళు కట్టుకుంటున్న వూరపిచుకలు కిచకిచమంటూ గోల చేస్తున్నాయి.

ధర్మతేజ నవ్వాడు. "జీవితంలో అపశ్రుతులు దొర్లిన వాడిని, తల్లీ! అందుకే మరే విషయంలోనూ వాటిని భరించే నిగ్రహం కోల్పోయాను" అన్నాడు.

విస్మయంగా చూసింది నర్తన.

ఏదో నిశ్చయించుకున్నట్టు నిశ్వసనంగా గుండె నిండా గాలి పీల్చుకున్నాడు ధర్మతేజ.

"ఆడు, నర్తనా! ఇక నీ అడుగు తడబడకూడదు. తప్పు పడకూడదు. ఇదిగో, ఈ విభూతి అందుకో" అంటూ తన భ్రూమధ్యంలో ఉన్న విభూతి వేలితో తీసి ఆమె నొసట ఉంచాడు.

నర్తన మనసులో నటరాజస్వామి నిలిచాడు. పవిత్రభావంతోకనులు అర్ధనిమీలితాలుకాగా ముద్ర ధరించి నిలబడింది సమభంగిమలో.

ధర్మతేజ చేతిలోని తాళం 'శ్ ఛ్' మని మోగింది. సృష్ట్యాదినున్న ప్రకంపనలో చిరుక్షణం. మరుక్షణం ఉచ్చస్వరంలో ధర్మతేజ కంఠం నించి జతిస్వరం.

"దిది దిత్తాం! ది దిత్తాం తై దిదిత్తాం!
తైతై దిత్తాం ది ది ది దిత్తాం దిత్తాం"

తటిల్లతలా కదిలింది నర్తన. ఘల్ ఘల్ మన్నాయి మువ్వలు. జతిస్వరానికి అనుగుణంగా పదకౌశలంమొదలైంది. మోహనరాగంకాలికదలికల్లో సమ్మోహనంగా పలుకుతూంది.

"దిత్తాం దిదితాం దిత్తాం కిటతక తక తరికిటతక
దిది దిత్తాం దిస్సాంతకుం తక తరికిట తక"

ధర్మతేజ గానానికి సర్వాంగ సుందరంగా అడుగులు వేస్తూ నర్తిస్తూంది నర్తన.

నిజానికి రసభావాలు లేక తాళ లయానుగుణంగా చేయబడే ఆంగికాభినయమే జతిస్వరంలో ఉండేది. కాని పరిపూర్ణమైన అంగసౌష్ఠవంతో సర్వాంగాల పైన సంపూర్ణాధికారంతో శోభాయమానంగా ఉన్న నర్తన నృత్యం చూస్తూంటే హృదయం రసోద్దీపిత మవుతూంది.

జతి స్వరం పూర్తయింది, కాసేపటికి.

"అంజలి హస్తం" కిందకు తెస్తూ గురు బ్రాహ్మణ నమస్కారం చేసి సమ దృష్టిలోకి మారి నిలబడింది నర్తన.

ధర్మతేజ కన్నుల్లో సంతృప్తి నిండింది.

"అలావెనుకతోటలో కూర్చుందాం పద, తల్లీ!". లేస్తూ అన్నాడు.

నర్తనకు సంతోషం కలిగింది, ఆయనకు తృప్తి కలిగేలా నృత్యం చేయగలిగినందుకు. ఆ ఆనందంతో కలిగిన వణుకు వణుకుతుంటూ కాలి మువ్వల పట్టీలు విప్పి కొయ్యగుంజకు తగిలించి మవునంగా ధర్మతేజ వెనక నడిచింది.

రెండు గదులుదాటి చక్కటి పెరటి తోటలోకి వచ్చారిద్దరూ.

అస్తమయ ఆకాశం వింత వింత రంగులతో ఆకర్షణీయంగా ఉంది. దూరాన కృష్ణ చాకిరేవులో ఆరగట్టిన నీలంచీరలా రెపరెపలాడుతూ కనిపిస్తూంది. పడమటి గాలికి తోటలోని రకరకాల పూలన్నీ పరవశిస్తూ వాతావరణాన్ని పరిమళ భరితం చేస్తున్నాయి.

ఒక మూలగా ఉంది మందార చెట్టు—పక్కగా రెండు పేము కుర్చీలు. కృష్ణకు అభిముఖంగా ఉన్న కుర్చీలో తాను కూర్చుంటూ నర్తనకు ఎదుటి కుర్చీ చూపాడు ధర్మతేజ ఎడమచేత.

పైట చెంగు ఒడిలోకి లాక్కుంటూ ఒదిగి ఒద్దికగా కూర్చుంది నర్తన.

ధర్మతేజ ఏదో ఆలోచనల్లో పడ్డాడు. దూరానికి దృష్టి సారించి తదేకంగా కృష్ణ నే చూస్తూండి పోయాడు.

కాలం ప్రశాంతంగా దొర్లి పోతూంది.

సీతాకోకచిలక ఒకటి ఎక్కడి నుండోవచ్చి నర్తన చుట్టూ రెండు సార్లు తిరిగి చేతిమీద వాలి మళ్ళీ ఎగిరిపోయింది.

తోటలో కూర్చుందామని తీసుకొచ్చిన ధర్మతేజ ఎంతకూ ఏమీ మాట్లాడక పోవడంతో తలెత్తి చూసిన నర్తన ఆయన కళ్ళ నిండా నీళ్ళు గమనించి ఉలిక్కి పడింది.

ధర్మతేజ రెప్పల్ని బలంగా అదుముకున్నాడు. చెంపల మీదకు జ్రరిన జారాయి కన్నీళ్ళు.

"మాస్టారూ!" పిలిచింది నర్తన.

తల బాధగా విదిలించాడు ధర్మతేజ. "లేదు, నర్తనా! ఇక ఈ రోజు నన్ను నేను నిగ్రహించుకో లేను. నా మంజీర జ్ఞాపకాలు ఉదయం నించీ నన్ను నిలవరించుకోనివ్వడం లేదు" అన్నాడు గుటకలు పోతున్న కంఠాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ.

"ఇందాకకూడా అన్నారు 'మంజీర' అని. ఎవరు, మాస్టారూ, ఆ మంజీర?"

"మంజీర! మంజీర నా ప్రాణం, నర్తనా. ప్రఖ్యాత నర్తకిగా మారి నాట్యకళను జీవంగా పోసుకోవాలని ఆశించిన అమాయకురాలు."

అంతే చెప్పాడు ధర్మతేజ. నర్తనకు అర్థం అంటూ అవకుండా అయింది. ఎర్రబారుతున్న కళ్ళతో కాసేపటికి తిరిగి అన్నాడు ధర్మతేజ: "ఈ శివరాత్రి రోజే నా మంజీర నాకు దూరమైంది."

"మాస్టారూ!"

ధర్మతేజ క్షణం మాట్లాడలేదు. నివర కన్నాడు: "వినగలవా?"

చెప్పమన్నట్టుగా చూసింది నర్తన.

ధర్మతేజకు గతమంతా కళ్ళ ముందు నిలిచింది.

## 2

అవి స్వాతంత్ర్య సమరం విజయవంతంగా ముగిసిన తొలి రోజులు. దేశమంతా స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటూ చైతన్యంతో వూగిపోతూంది. అధినివేశ ప్రతిపత్తినికూడా వదిలించుకుని సర్వసత్తాక రాజ్యంగా మారే రోజు కోసం కలలు కంటున్న సుదినాలు.

శంగున ఆలయంలోని గంట మోగింది.

సిగ్గు పడుతూ ధర్మతేజ చేతిలోని తన చేయి విడిపించుకుంది మంజీర. కళ్ళు రెండూ మూసుకుని భక్తితో అమరేశ్వరునికి అంజలి ఘటించింది.

మంజీర ధర్మతేజ అత్తయ్య కూతురు. ఆమె తండ్రి కృష్ణమూర్తి స్వాతంత్ర్యసమరంలో ప్రాణాలు

పొగొట్టుకున్నాడు పదేళ్ళ కిందటే. ఆ తరవాత మరో రెండేళ్ళకే మంజీరను అన్న శివరామశర్మ చేతిలో ఉంచి ప్రాణాలు విడిచింది మళూచి పోకిన మహాలక్ష్మి. అప్పటికే విధురుడై కాలం వెళ్ళబుచ్చుతున్న శివరామ శర్మకి మరో బాధ్యత భుజాల మీదికి వచ్చింది.

మంటపంలో ఉంచిన నీటిబిందె అందుకుని నడుముకు పట్టింది.

అక్కడ పడి ఉన్న ఒక పిచ్చిపుల్ల అందుకుని, లాల్చీమీద తాళం వేసుకుంటూ ధర్మతేజ నడక మొదలుపెట్టాడు. దారి పొడుగునా ఏవో

''ఏమిటి విషయం?'' శివరామశర్మ ప్రశ్నించాడు.

కంగుమన్న ఆయన కంఠధ్వనిలో కంగారులో మంజీర చేయి జారిన గాజు చిమ్మా శబ్దం కలిసి పోయింది. ధర్మతేజ మాట్లాడబోయే విషయం మంజీరకు తెలుసు.



అంతా సంతోషంగా స్వీకరించాడు. మంజీర, ధర్మతేజ ఇద్దరినీ రెండు కళ్ళుగా పెంచాడు.

కాలం గడిచి ఇద్దరూ యుక్త వయసులోకి అడుగు పెట్టారు.

పూజారి మంజీరను ఆశీర్వదించి పలకరించాడు. ''ఏం తల్లీ, నీ నాట్యసాధన ఎలా ఉంది?''

దానికి సమాధానం ధర్మతేజ చెప్పాడు. ''ఎలా ఉంటుందీ? బహు చక్కగా ఉంది. నాన్నగారికి తగ్గ శిష్యురాలు.''

మంజీర నవ్వింది, ఎగురుతున్న ముంగురులు సవరించుకుంటూ.

పూజారీ నవ్వాడు.

''పద.'' ధర్మతేజ పిలుపుతో మరోసారి అమరేశ్వరునికి నమస్కరించి అతని వెనకే నడిచింది మంజీర.

కబుర్లు చెబుతూనే ఉన్నాడు. మంజీర చిరునవ్వులే సమాధానా లయ్యా యంతటా.

• • • •

ఆ సాయంత్రం ఏ నాడూ లేనిది ధర్మతేజ తండ్రి ఎదుట కూర్చున్నాడు సావధానంగా, స్నానాదికాలు కానిచ్చి వచ్చి.

శివరామశర్మ చదువుతున్న నాట్యశాస్త్ర గ్రంథాన్నుంచి తలెత్తి విచిత్రంగా చూశాడు.

ఆకాశంలో సంజ చీకట్లు ముసురుకుంటున్నా యప్పుడప్పుడే. మంజీర లోని గదిలో కొడిగట్టిన దీపపు వత్తులు నలిపి దీపాలను శుభ్రం చేస్తూంది.

తండ్రి తన వైపు చూడడంతో రెండు చేతులతో జుత్తును చెవుల వెనక్కి తోసుకుంటూ కాళ్ళు ముడుచుకుని గొంతు సవరించుకున్నాడు ధర్మతేజ.

భయం భయంగా చెవులు రిక్కించింది ధర్మతేజ కంఠం కోసం.

క్షణం ఆగి వినిపించింది—''మీరు కాస్సేపు నాట్యశాస్త్రాన్ని పక్కనుంచగలరా?'' అన్న ధర్మతేజ గొంతు.


మంజీర గుండె దడ హెచ్చింది.

శివరామశర్మ చురుకుగా ధర్మతేజ నో క్షణం పరీక్షించి చేతిలోని గ్రంథాన్ని మడిచి పక్కనుంచుతూ 'చెప్పు' అన్నట్టు చూశాడు.

ధర్మతేజ నిమేషమాత్రం కళ్ళు మూసుకుని తిరిగి నిశ్చలంగా తండ్రి వంక చూశాడు.

''నేను చెప్పబోయేది సావధానంగా వినండి. ఉద్రేకం తెచ్చుకోవద్దు'' అన్నాడు.

శివరామశర్మ భంగిమలో మార్పు రాలేదు.




చూపులు మాత్రం మరింత వాడిగా మారాయి. వాటిని తప్పించుకుంటూ చెప్పాడు ధర్మతేజ.

"నేను చదువు కొనసాగించా లనుకుంటున్నాను. మదరాసు పోయి ఇంజనియరు కోర్సు చదవాలని నిశ్చయించుకున్నాను."

"నీవు ధర్మతేజవేనా?" చటుక్కున అడిగాడు శివరామశర్మ.

ధర్మతేజ తుళ్ళి పడ్డా డా ప్రశ్నకు. అయినా తండ్రి తత్త్వం తెలిసిన వాడు కావడంవల్ల సర్దుకుని వెంటనే తగిన సమాధాన మిచ్చాడు.

"అవును. వేదాంతం విశ్వతేజశర్మ మనుమడు, శివరామశర్మ తనయుడు ధర్మతేజనే."

"బాగా చెప్పా వబ్బాయీ!" నవ్వి అన్నా డాయన. "కాని శివరామశర్మ తన తనయుడిలా ఇంగ్లీషు చదువుల వెనక పోతానంటాడని ఎన్నడూ అనుకోలేదు మరి!"

ఆ సంభాషణ వింటూ మంజీర నిస్త్రాణగా చేష్ట లుడిగి కూర్చుండి పోయింది లోని గదిలో. తండ్రీ కొడుకులు అలా రెండు సింహాల్లా తలపడితే అది ఎంతవరకూ పోగలదో ఆమెకు తెలుసు.

తండ్రి మాటలు విన్న ధర్మతేజ తల వంకిస్తూ ఉండిపోయాడు కొన్ని క్షణాలు. చివరకు తను అనుకున్నది తండ్రితో చెప్పడానికే నిశ్చయించుకుని వాదనకు నాందిగా ఒక సూటి ప్రశ్న వేశాడు. "ఈ దేశం అభివృద్ధి చెందడం మీకు ఇష్టమేనా?"

అడుగు వెనుదీయడం శివరామశర్మ వంతయింది. "అదేం ప్రశ్న?"

"అదేం ప్రశ్న కాదు. అదే ప్రశ్న!"

ధర్మతేజ ధోరణికి శివరామశర్మ ముఖం మ్లాన మైంది. తన ముందే ఎదిగి పోయినట్లు ప్రవర్తిస్తున్న కొడుకు వంక బాధగా చూస్తూ "ఈ దేశపు సర్వతోముఖ అభివృద్ధే నా ఆకాంక్ష, అబ్బాయీ! అదే లేనినాడు ఇన్ని వందల మంది పోటరులూ,సహజనులూ స్వాతంత్ర్య సముపార్జన అంటూ బలిపశువులు కావడం దేనికి?" అన్నాడు.

"నిజం కదూ! మరి అప్పుడు నేను ఇంజనియరుగా నా దేశానికి సేవ చేయబూనడాన్ని ఎందుకు హర్షించ లేరు?"

మౌనమే శివరామశర్మ సమాధానమైంది.

"లేదు, నాన్నగారూ! ఒకప్పుడు నేను చదువు తూంటే దాస్య శృంఖలాల నుంచి దేశ విమోచనకై అందరూ పోరాడుతూండగా మన మా ఇంగ్లీషు చదువులు చదవరాదని నన్ను శాసించారు. ఇంటర్మీడి యట్‌తో ఆపివేశారు. అప్పటికి మీ నిర్ణయం సముచితం కావచ్చు. కాని నేడు పరిస్థితులు వేరు.

తెల్లదొరలు రాజ్యం విడిచారు. మనదైనరాజ్యాంగం తయారవుతూంది. స్వేచ్ఛా వాయువులు పీల్చు కుంటున్నాం. మరి ఇక ఇప్పుడు ఒక ఉన్నత విద్యను ప్రాచ్యమనో, అప్రాచ్యమనో దూరంగా ఉంచితే ఈ దేశం అభివృద్ధి చెందే దెలా?"

అడ్డు తగిలాడు శివరామశర్మ. "నీవు చెప్పేదీ, చెప్పనున్నదీ అర్థం చేసుకో లేనంతటి వివేక హీనుణ్ణి కానబ్బాయీ! నీ బాధ నాకు అర్థమైంది. అయితే నీకే కాదు, ఈ దేశంగురించి నాకూ కల లున్నాయి."

ఎటో చూస్తూ మాట్లాడుతున్న తండ్రి వంక నిర్మలంగా చూశాడు ధర్మతేజ.

శివరామశర్మ కొనసాగించాడు. "కాని, అబ్బాయీ! నీవు ఆలోచించే అభివృద్ధి ఒక రకం, నే నాలోచన చేసే అభివృద్ధి మరో రకం. ఆర్థిక రంగంలో అభివృద్ధి గురించి నీ వాలోచిస్తున్నావు. పతనమై పోతున్న ఈ దేశపు విశిష్ట లలితకళల అభ్యున్నతిని గురించి నే నాలోచిస్తున్నాను" అని ఆగాడు శివరామశర్మ.

ధర్మతేజ రెండు చేతులతో జుట్టు మరోసారి సవరించుకున్నాడు.

"నేడు దేశంలో కళలు ఒకప్పటి తమ ఉత్కృష్ట స్థానాన్ని పోగొట్టుకుని క్షీణదశలో పడ్డాయబ్బాయీ! ఈ పరిస్థితి మరి ఇలాగే సాగితే కనుచూపుమేరలోనే ఇవి పూర్తిగా కనుమరుగై పోతాయనడానికి సందే హించను. నాట్యశాస్త్రమందు గాని, దాని భంగిమ లందు గాని ప్రవేశం లేని వారికికూడా ఆనందకారి కాగలదని భరతుడు వాకొన్న నృత్తకళకుకూడా నేడీ దుర్దశ సంప్రాప్తమయింది. దీనిని మనం ఎదుర్కో వాలి. ఈ కళలను భరతమాత కంఠాభరణాలుగా పది కాలాలపాటు వెలగనివ్వాలి. అందునా సర్వ ప్రపంచానికీ స్వాభావికముగానే ఇష్టపూర్తములని చ్చే నాట్యకళను...."

"ఇంతకూ మీ రనే దేమిటి?" అడ్డు తగిలి అన్నాడు ధర్మతేజ. తండ్రి చెప్పబోయేది అతనికి చూచాయగా అర్థమైంది. దాని తాలూకు అయిష్టత ముఖంలోకి వచ్చిందికూడా.

అప్పటికే ఆకాశంలో చీకట్లు దట్టంగా ముసురు కున్నాయి.సంజ వెలుగు పూర్తిగా జారుకుని అంతటా అంధకారం ఆవరించింది.

శివరామశర్మ కళ్ళజోడు తీసి అంగవస్త్రంతో తుడిచి మళ్ళీ తగిలించుకున్నాడు. "నీవు చెప్పే ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడేందుకు డాక్టర్లు, ఇంజనియర్లుగా మారడానికి చాలా మంది సిద్ధంగా ఉన్నా రబ్బాయీ! కాని కళారంగం పరిస్థితి అలా కాదు. అందుకే ఈ ప్రాచీన కళా వైభవ పునరుద్ధరణకు నాకు చేదోడు కమ్మంటున్నాను." చెప్పా డాయన.

వెంటనే తల అడ్డంగా వూపాడు ధర్మతేజ. "ప్చ్!" అని తేల్చేస్తూ "మిమ్మల్నేం ఉద్ధరించిందని, నాన్న గారూ, నన్నుకూడా ఈ కళారంగంలోకి దిగమంటు న్నారు?" అడిగాడు.

"అలా అడిగితే ఆ ప్రశ్నకు నా దగ్గర సమాధానం లేదబ్బాయీ!"

"సరే! నే నేమయినా సరే మదరాసు పోతానంటే మీ రేం చేస్తారు?"

"ఏం చేస్తా నబ్బాయీ, చేతు లెత్తి ఈ నమస్కారం తప్ప." చేతులు జోడిస్తూ అన్నాడు శివరామశర్మ. "ఈ కళల కాణాచి కళలకు కరువాచి పోయే రోజు చాలా దగ్గరలోనే ఉందనిపిస్తూంది. ఒక కళాకారుని సంతానమే ఇందుకు ఇంత విముఖత చూపితే ఇంక ఇతరులను నిందించి లాభమేముంది?" గొణుగుకుంటూ తల ఎటో తిప్పుకుని కళ్ళు మూసుకున్నాడు.

అప్పుడు మాత్రం ధర్మతేజ నిజంగా బాధ పడ్డాడు. ఆ వృద్ధుని ముఖంలో తిరిగిన వేదనను చూడలేక ఏదో సర్ది చెబుదామనుకున్నాడు కాని గొంతు పెగలలేదు.

మరి కాసే పలాగే మౌనంగా కూర్చుని తండ్రి పాదాలంటి నమస్కరించి లేచాడు.

ఇంతలో వచ్చిన కాలి వెండి పట్టీల సవ్వడికి శివరామశర్మ కళ్ళు తెరిచాడు. అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చిన మంజీర దీపం గూటిలో ఉంచి తిరిగి లోనికి పోయింది.

గదిలోని చీకటి స్థానే కాస్త వెలుగు పరుచుకుంది. మసక మసకగా వస్తువులన్నీ కన్పిస్తున్నాయి. మంది రంలో నటరాజస్వామి కంచు విగ్రహం వింత వెలుగులు చిమ్ముతూంది.

"అబ్బాయీ!"

పక్క గదివైపు అడుగులు వేయబోతున్న ధర్మ తేజను ఆపింది శివరామశర్మ పిలుపు. భుజం మీంచి

తల తిప్పి చూశాడు ఏమిటన్నట్టు.

"మరి మంజీర సంగతి ఏం చేయ దలిచావు?" అడిగా డాయన.

"అత్తయ్య కోర్కె వమ్ము చేయను." ధర్మతేజ చెప్పాడు.

"చాలు. కనీసం ఆ వర మిచ్చావు." అదే చాలు నన్న తృప్తి ప్రకటించాడు శివరామశర్మ. "మరి నీ సంగతులు నీవే నిర్ణయించుకుంటున్నావు. ఆమెకూడా నీదే గనక ఆమె నృత్యం కొనసాగించడంపై నీ అభిప్రాయమేమిటో కూడా చెప్పు."

తలుపు చాటున వింటున్న మంజీర గుండెలో పిడుగు పడ్డట్టయింది. కాని ధర్మతేజ జవాబు ఆమెను శాంతపరిచింది. 'హమ్మయ్య' అనుకుంది.

"నాకు అభ్యంతరం లేదు." ధర్మతేజ చెప్పాడు.

"కృతజ్ఞుణ్ణి. ఆమె కుంటుందని నే ననుకోను." శివరామశర్మ కళ్ళజోడు మడిచి పక్కన పెట్టాడు.

అలా ముగిసింది తండ్రీ కొడుకుల సంభాషణ ఆ రోజు.

● ● ● ●

ఒకసారి ఆ విధంగా ఇంజనీరింగు కోర్సు చేయాలని నిశ్చయించుకున్నతరవాత ధర్మతేజ ఇక ఆ విషయమై విషయసేకరణ ప్రారంభించాడు. అంతా ఒక కొలిక్కి వచ్చేసరికి తనకు విద్యార్థి వేతనం కూడా లభించ వచ్చునని తోచింది. తృప్తిగా నిట్టూర్చాడు.

ఈ లోగా అతని పట్ల తండ్రి ప్రవర్తన మాత్రం విచిత్రంగా మారింది. ధర్మతేజ ఎదురైతే చాలు, శివరామశర్మ ముఖంలో బాధతో నీలినీడలు కదలాడేవి. చూపు లెటో తిప్పుకునే వాడు. ఆయన బాధేమిటో ధర్మతేజకు తెలిసినా ఏమీ చేయలేని స్థితి.

ఆ రోజు నిండు పౌర్ణమి.

భోజనాలు పూర్తయ్యాక ధర్మతేజ తండ్రి గది దగ్గరకు పోయి నించున్నాడు. ఆయన చదువుతున్న గ్రంథం నుంచి తలెత్తి చూసే వరకూ ఆగి చెప్పాడు.

"నాన్నగారూ! నేనూ, మంజీరా వాహ్యాళి కలా కృష్ణా తీరానికి వెళ్ళాలనుకుంటున్నాము. వెళ్ళమంటారా?"

శివరామశర్మ హాయిగా నవ్వాడు. "నీ కొన్ని అభిప్రాయాలతో ఏకీభవించలేక పోవచ్చు కానీ, నీ వ్యక్తిత్వంమీద నాకు పూర్తి నమ్మకం ఉందబ్బాయీ! అనుమతి కోసం అడగ నక్కర్లేదు. మాట మాత్రం చెబితే చాలు. పో వెళ్ళిరండి" అన్నాడు.

ఆరుబయట వెన్నెల పత్తిపంటలా విచ్చుకుని ఉంది.

కృష్ణ చేరేవరకూ మంజీర ఏమీ మాట్లాడలేదు ధర్మతేజతో. ఎప్పుడూ ఏదోటి మాట్లాడుతూండే ధర్మతేజకూడా ఆ రోజెందుకో మౌనం వహించాడు.

ఊరంతా మెల్లగా నిద్రలోకి జారుకుంటున్న వేళ అది.

డిసెంబరు నెల చివరి రోజులు. ఊరంతా సంక్రాంతి ముగ్గులు మనోహరంగా తీర్చబడి ఉన్నాయి. పన్నని మంచు తెరలు కదులుతున్నాయి అంతటా. చలి కాస్త తీవ్రంగానే ఉంది.

వెన్నెల వెలుగులో తళతళ లాడుతూ నల్ల తాచులా ఉంది కృష్ణ. చలి గాలికి తీరానున్న ఇసుకకూడా చల్లబడింది.

పైట చెరగు భుజం చుట్టూ కప్పుకుంటూ కూర్చుంది మంజీర ఆ ఇసుక తిన్నెలపై. ఆమె పాదాల మీద తల పెట్టుకుని పడుకున్నాడు ధర్మతేజ.

కాసేపు ఇద్దర్లో ఎవరూ మాట్లాడ లేదు.

మంజీర తన పాదాల మీద పడుకున్న ధర్మతేజను, ధర్మతేజ ఆకాశంలో వెన్నముద్దలా ఉన్న చందమామను చూస్తూండి పోయారు.

"లే, తేజా—కాళ్ళు మీదేమిటి?" మరి కాసేపు చూసి అంది మంజీర.

చంద్రుని మీంచి ఆమె వైపు తల తిప్పాడు ధర్మతేజ. ఒక్క క్షణం ఆమెను పరీక్షగా చూసి అడిగాడు:

"మంజీరా! ని న్నో విషయం అడుగుతాను. నిజం చెబుతావేమి టి?"

వెన్నెల వెలుగులో అతని పలువరస తళుకు తళుక్కున మెరిసింది.

"దాని దేముంది?" బదులు చెప్పింది మంజీర.

"ఇంతకు ముందు ఇంజనీరింగు చదవాలని నిశ్చయించుకున్నానవే నీకు చెప్పాను తప్ప అందుపై నీ అభిప్రాయం అడగలేదు."

మంజీర చూపు కృష్ణ పైకి పోయింది. "మామయ్య మాటకు విలు 'విచ్చావు గనకనా




"కర్కశంగా, గరుకుగాఉండే
పళ్ళపొడులు మీ పళ్ళకు,
చిగుళ్ళకు
హానికలిగించవచ్చు..."

TP.G.30 TL

కోల్గేట్ టూత్ పౌడర్‌తో మీ చిగుళ్ళను, చెడుశ్వాసను కూడా అరికట్టండి, పళ్ళను కాపాడుకోండి.

కోల్గేట్ టూత్ పౌడర్ ఎంతో మెత్తగా ఉండే తెల్లని పౌడర్. అది అతి మృదువుగా మీ చిగుళ్ళను తోముతుంది. అంతేగాకుండా దానిలో ఉండే సున్నితమైన మెరుగునిచ్చే పదార్థం మీ పళ్ళ మీది పాచిపొరలను తొలగిస్తుంది. మీ పళ్ళను శుభ్రపరచి తెల్లగా చేస్తుంది. కోల్గేట్‌లోని పుష్కలమైన నురుగునిచ్చే చర్య పళ్ళ సందులలోనికి చొచ్చుకుపోయి చెడు వాసనను దంతక్షయకారకములైన సూక్ష్మ క్రిములను తొలగిస్తుంది.

**మీ కుటుంబానికి కోల్గేట్ టూత్ పౌడర్‌తో అధునాతనమైన తీరులో దంతరక్షణ సమకూర్చండి. దానియొక్క చల్లని, పిప్పర్‌మెంట్ రుచిని వారంతా మెచ్చుకుంటారు..**



నా మాట గౌరవిస్తావనుకోవడానికి!''

''హాఁ! అయితే నీకూ ఇష్టం లేదన్నమాట!'' నిట్టూర్చాడు ధర్మతేజ.

మంజీర మాట్లాడలేదు.

''నాకు నాట్యకళ అంటే విముఖతకాదు, మంజీరా! కాని దాని నభ్యసించి ఉద్ధరించేదేమీ లేదని పిస్తూంది—అంతే.''

''కళ మన నుద్ధరించే రోజులు కావివి, తేజా! మనం కళ నుద్ధరించ వలసిన రోజు లివి!''

విస్తుపోయాడు ధర్మతేజ. ''చాలా ఎదిగిపోయావే, మంజీరా!'' అన్నాడు లేచి కూర్చుంటూ.

గలగలా నవ్వింది మంజీర—కృష్ణమ్మలా.

''నాకు నీ నృత్యం చూడాలని ఉందంటే ఏదైనా చేయగలవా ఇప్పుడు?''

''జయదేవాష్టపది చేయనా?'' పైట బిగదీసి, కటిని దోపుతూ అడిగింది మంజీర, అప్పుడే.

''నీ ఇష్టం.''

''ఏ విధమైన వాద్యమూ లేదు. కాలికి కనీసం గజ్జెలయినా లేవు. నాట్యానికి నే నేమైనా అపచారం చేస్తున్నానేమో నాకు తెలియదు. కేవలం నీ కోసమే చేస్తున్నా'' అని చెప్పి కాస్త దూరం పోయి నుంచుని గొంతు సవరించుకుని అష్టపది పాడుతూ అభినయం మొదలుపెట్టింది.

''రతిసుఖసారే గతమభిసారే మదన మనోహరవేశం
నకరు నితంబిని గమన విలంబన మనుసరతం
హృదయేశం
దీరసమీరే యమునా తీరే. . .''

కోకిల గానంతో నెమలి నాట్యం చేస్తున్నట్టుగా ఉంది. తన్మయుడై చూశాడు ధర్మతేజ.

పిండి వెన్నెల వెలుగులో ఒడలు పులకరించేలా ఆడి ఆడి ఎప్పటికో ఆగింది మంజీర. ధర్మతేజ నోట మాట లేదు. రెప్ప వాల్చకుండా అలానే ఆమె వంక చూస్తూండి పోయాడు.

నవ్వుతూ పైట చెంగుతో ముఖాన పట్టిన చిరు చెమటను అద్దుకుంటూ వచ్చి కూర్చుంది మంజీర. ''ఇసుకలో చాలా కష్టం, బాబూ! అడుగు తడబడింది ఒకటి రెండు సార్లు'' అంది.

నవ్వాడు ధర్మతేజ. ''నాకు తెలియలేదే!''

''నీకు తెలియలేదని నేను తప్పు చేయగలనా?'' ఇద్దరి నవ్వులతో కృష్ణమ్మకూడా గొంతు కలిపింది.

•     •     •     •


సంక్రాంతి పండుగంతా శివరామశర్మ ఇంట్లోనే ఉన్నట్టుంది ఆ రోజు. ఉదయం నించీ ఏవేవో పిండివంటలు చేస్తూ వంట గదిలో సతమతమై పోతూంది మంజీర. ధర్మతేజ సాయం చేస్తానంటూ పోతే కసిరి తరిమేసింది.

అంతే హడావుడిగా ఉన్నాడు ముందు వరండాలో శివరామశర్మ వచ్చీ పోయే వాళ్ళతో కబుర్లు చెబుతూ.

''స్వతంత్రం వచ్చాక వచ్చిన తొలి పెద్ద పండగయ్యా!'' ఎవరో రైతు ఆనందం వ్యక్తం చేశాడు.

''కాదుటయ్యా మరి!'' శివరామశర్మ లోనూ అంత ఆనందమే.

ఇక ఆ మధ్యాహ్నం భోజనాల దగ్గర విస్తట్లో




బొబ్బట్లను చూస్తూనే శివరామశర్మ చిన్నపిల్లాడే అయాడు. ఆప్యాయంగా పళ్ళెం దగ్గరకు లాక్కున్నాడు. ముఖంలోకి చెప్పలేనంత వెలుగు తన్నుకొచ్చింది.

''శ్రమ పడతా వెందుకలే అని, తినాలనున్నా చెప్పలేదు, తల్లీ! చక్కగా చేశావు. చాలా చక్కగా చేశావు'' అంటూ పదే పదే మెచ్చుకుంటూ జాలుగా నేయి వంచుకుని తృప్తిగా తిన్నాడు.

ఆ క్షణం ఆయనను చూసిన ధర్మతేజకు కళ్ళలో నీళ్ళు తిరిగి తల దాచుకున్నాడు.

శివరామశర్మ ఇంచుమించు బొబ్బట్లతోనే కానిచ్చేసి కాస్తంత అన్నం మాత్రం పెరుగుతో తిని లేచి పోయాడు.

మంజీర కళ్ళలో చెప్పలేని తృప్తి.

అలవాటుగా ఒక కునుకు తీసి, నాలుగవుతూండగా లేచిన తరవాతకూడా శివరామశర్మ అంతే హుషారుగా కనిపించాడు. చన్నీళ్ళతో ముఖం కడుక్కుని వచ్చేసరికి మంజీర వేడిగా సేమియా పాయసం అందించింది. పులుకు పులుకు నవ్వుతూ అందుకున్నాడు. ''చల్లగా వర్ధిల్లు, తల్లీ!'' అని దీవించాడు. ''అబ్బాయి తీసుకున్నాడా?'' అని అడిగాడు ఆర్చుకుని ఆర్చుకుని తాగుతూ.

''ఆఁ.'' చెప్పి అక్కడే కూర్చుంది మంజీర.

''చాలా చక్కగా చేశావమ్మా ఇవాళ వంటకాలన్నీ. పూర్తి చేసి గ్లాసు కింద ఉంచుతూ మళ్ళీ మెచ్చు కున్నాడు, గుండెలోని ఉబలాటం దాచుకోలేక.

నవ్వింది మంజీర, ముక్కున పుడక సవరించు కుంటూ.

''అబ్బాయి ఉన్నాడా?''

''ఆఁ.''

పిలిచాడు గొంతు హెచ్చించి. ధర్మతేజ వచ్చాడు.

''ప్రదర్శన ఇచ్చేయగల స్థాయికి అమ్మాయి నాట్య విద్య చేరుకుంది. ఇక మరి ఆలస్యమెందుకు? వచ్చే శివరాత్రినాడు ఆలయంలో 'ఆరంగేత్రమ్?' ఏర్పాటు చేయిస్తాను.

శివరామశర్మ మాటలువింటూ మంజీర ఆశ్చర్యంగా ముఖం పెట్టింది. అంతవరకూ ఆమెతో ఎన్నడూ ఆయన ఈ మాట అనలేదు.

''మీ ఇష్టం, నాన్నగారూ: నాదేముంది?'' ధర్మతేజ బదులిచ్చాడు.

రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్టు శివరామశర్మ తలుచుకుంటే ఆ వూళ్ళో సంరంభాని కేం కొదవ?

రెండు రోజుల్లో వూరంతా తెలిసిపోయింది శివరాత్రినాడు ఆలయంలో మంజీర రంగ ప్రవేశం చేయబోతున్నట్టు.

మంజీర గుండెలో కొత్త బెరుకు ప్రవేశించింది.

అదే విషయం ఒక వారం రోజులనాడు భోజనానంతరం బయటపెడితే 'అమాయకురాలా' అన్నట్టు ఆయన తల నిమిరాడు. ''నీవు శివరామశర్మ శిష్యురాలవమ్మా. భయపడకు'' అని అభయ మిచ్చాడు.

అలా చెప్పిన శివరామశర్మ మరో వారం తిరిగేసరికి కూలిపోయాడు.

శివరాత్రి దగ్గర పడుతూండడంతో మంజీర 'ఆరంగేత్రల్' కు తనకు తెలిసిన పెద్దలను ఆహ్వానించి రావడానికి ఆ రోజు తెల్లవారుజామునే లేచి గుంటూరు వెళ్ళాడు. వెళ్ళినవాడు సాయంత్రం నాలుగవుతుండగా వల్లగా మాడిపోయి, నిలువునా వడలిపోయి వచ్చాడు.

శరీరంలో రక్తం చుక్క లేనంత నీరసంతో వచ్చి తల రెండు చేతులతో పట్టుకుని వాకిలి మెట్లమీదే కూలబడిపోయాడు.

ధర్మతేజ పరుగెత్తుకు వెళ్ళి లేవదీసి లోనికి తీసుకు వచ్చాడు. ''ఏమైంది, నాన్నగారూ?'' వణుకుతూ అడిగాడు.

''గాంధీజీని హత్య చేశా రబ్బాయీ!''

''నాన్నగారూ!'' దెబ్బ తిన్నట్టు వెనక్కి తగ్గాడు ధర్మతేజ. బయటికి రాబోయిన మంజీర తలుపుకి అతుక్కుపోయింది నిర్విణ్ణయై.

11—8—82

అందరిలోనూ ఒక్కసారిగా విస్ఫత్ను ఆవరించింది.

"అయిపోయిం దబ్బాయీ—మన జాతి జీవన జ్యోతి ఆరిపోయింది. ఇక అంధకారమే మనకు మిగిలింది. అహింసాయుధంతో సామ్రాజ్యవాదుల్ని ఎదుర్కొని, బానిసత్వం నుంచి దేశానికి విముక్తి కలిగించిన ఆ మహనీయుని కాల్చి చంపింది ఒక భారతీయుడట అబ్బాయీ, భారతీయుడట!" మదురు బాదుకుంటూ రోదించసాగాడు శివరామశర్మ.

ఆయన్ను ఆపాలన్న కనీస ధ్యాస ధర్మతేజ, మంజీరల్లో ఎవరికీ లేకుండా పోయింది.

ఉన్నట్టుండి శివరామశర్మ తన గదిలోకి వడివడిగా పోయాడు. మరి కాసేపటికే 'భోం భోం భోంభోం భోం' అంటూ శంఖానాదమూ, 'డమడమడమ' మంటూ డమరుకధ్వనులూ మిన్నంటి వచ్చేసరికి ఉలిక్కి పడి ధర్మతేజ గుమ్మం దగ్గరకు పోయాడు.

నటరాజు విగ్రహం నించి ఇంత విభూతి తీసుకుని శివమెత్తి పోతున్నట్టు లేచి శివతాండవం మొదలు పెట్టాడు శివరామశర్మ.

భయంగా ధర్మతేజ భుజం వెనుక దాగింది మంజీర.

తాండవంచేశాడు, చేశాడు,చేశాడు. చేసి,చేసి,చేసి భువనభోంతరాళాలు దద్దరిల్లే పద ఘట్టనలతో సంహార తాండవంలో మారి క్షణాల్లో కర్ర విరిగినట్టు విరుచుకు పడిపోయాడు వెల్లకిలా.

అంతే. అలా పడ్డ శివరామశర్మ పడ్డట్టే ఉండిపోయాడు. తిరిగి లేవలేదు. శరీరమంతా పక్ష వాతం కమ్మిందని తేల్చారు వైద్యులు.

● ● ● ●

మహా శివరాత్రి రోజు...

అంతా సజావుగా ఉండి ఉంటే ఆలయంలో మంజీర గజ్జె కట్టవలసిన రోజు.

కాని శివరామశర్మ మంచాన పడటంతో అంతా తారుమారయింది. ధర్మతేజ కూడా అదోలా తయారయ్యాడు. తండ్రి వంకే చూస్తూ గడుపు తాడు ఉలకడు. పలకడు.

మంజీరకు అంతా భయం భయంగా మారింది.

ఎప్పుడూ నాట్య గ్రంథాల పఠనంతో, తనతో నృత్యం చేయిస్తూనో గడిపే శివరామశర్మను ఆమె అలా మంచంలో చూడలేకపోతూంది.

రెండు వారాల క్రితం సంక్రాంతినాడు ఆప్యాయంగా ఆయన చేసిన భోజనమే పదేపదే ఆమెకు గుర్తొస్తూంది.

"అబ్బాయి సహకరిస్తే మీ అత్తయ్య నగలమ్మి ఒక 'నృత్య నికేతనం' ప్రారంభించా లనుకునేవాడిని, తల్లీ! కాని నా కా అదృష్టం లేదు కదా!" తెగ బాధ పడేవాడు.

"మీ కెందుకు, మామయ్యా! నే మున్నాగ!" ఊరడించేది మంజీర.

అవన్నీ జ్ఞాపకం వచ్చి మంజీర వేదనను పెంచేవి. అసలు శివరామశర్మ మాట్లాడితేనే నాట్యం గురించి మాట్లాడేవాడు. ఆఖరుకు గుంటూరు వెళ్ళబోయే ముందు రోజు కూడా మంజీరతో అదే చర్చ.

"ఒకనాటి స్థాయితో పోల్చితే నేటివారు కళా ప్రమాణాలుతగ్గించి పబ్బం గడిపేస్తున్నారు, తల్లీ. అది శాస్త్ర విషయమనే కాదు, సాహిత్య, నాటకాదు లనే కాదు...ఆఖరుకు నాట్య విద్యకు కూడా పాకింది. ఒక యాభై, అరవై సంవత్సరాల క్రితం నాట్య విద్యా విధానం తెలిసిన విద్వాంసులన్నా, నాట్యాచార్యులన్నా, నర్తకీ జనంఅన్నా అమరుక, పుష్పబాణ, కృష్ణ కర్ణామృత శ్లోకాలూ జయదేవాష్టపదులూ, భరతరస ప్రకరణం, అభినయ దర్పణం వంటి గ్రంథాలన్నీ చదివి చక్కటి సమన్వయ విధానం తెలిసి ఉండేవారు. నే డది ఎక్కడో గాని లేదు. కాని, చెప్పుతల్లీ! నేను నీతో ఆ గ్రంథాలు చదివిస్తున్నానా, లేదా?"

"ఊఁ." బదులు చెప్పింది మంజీర.

"ప్రమాణాలు నాశనం చేయడంకంటె ప్రాణాలు తీసుకోవడం ఉత్తమం, తల్లీ!" అన్నా రాయన. అంతా గుర్తొచ్చి నిట్టూర్చింది మంజీర.

తూరుపు తెలతెలవారుతూండడంతో పూజా సామగ్రి సిద్ధం చేసుకుంది. శివరామశర్మ గదిలో అలాగే కూర్చున్న ధర్మతేజ వద్దకు నడిచింది.

"తేజా! కృష్ణలో స్నానం చేసి ఆలయానికి వెళ్ళొద్దాం. రారాదూ!" అడిగింది.

"రాలేను. నువ్వెళ్ళి రావే, మంజీరా! అన్నాడు ధర్మతేజ.

మంజీర వెళ్ళింది. అయితే మరి తిరిగి రాలేదు. కృష్ణమ్మకు ఏం ఆప్యాయత కలిగిందో ఏమో రెండుచేతులూచాచిఆమెను తనకౌగిలిలోకి లాక్కుంది. అందుకు సహకరించింది ఒక పాకుడు రాయి.

మంజీర కృష్ణలో మునిగిపోయిందన్న వార్త ధర్మతేజను చేరింది.

● ● ● ●

చితికి నిప్పంటించినప్పుడైనా ధర్మతేజ కంట నీటి బొట్టు రాలలేదు. దవడలు చిట్లిపోయేంత బలంగా పళ్ళు మాత్రం నూరుకున్నాడు.

రెండురోజుల తర్వాత మట్టి కుండలో మంజీర చితాభస్మంతో వచ్చిన ధర్మతేజ సరాసరి తండ్రి గదిలోకి వెళ్ళి నటరాజ విగ్రహం మీద భళ్ళున బోర్లించాడు, దానిని. ఇంత బూడిద చేతిలోకి తీసుకుని నుదుటికి రాసుకున్నాడు, కసిగా. మరింత తీసుకుని పిచ్చిగా ఒళ్ళంతా పూసుకున్నాడు. తీక్షణ్ణంగా నటరాజునే చూస్తున్న అతని కళ్ళకు కన్పిస్తున్న దొకటే—

చితి మీద మంటలు ఆక్రమిస్తూండగా, నరాలు మెలి తిరిగే వేడిలో కాలికి కాలు పెనవేసి అపూర్వమైన భరత నాట్య భంగిమ 'నాగబంధ' దాల్చిన మంజీర పాదాలు!

మరణం సైతం మార్చలేని ఆమె నర్తించే పాదాలు!

శివరామశర్మ మూలగడంతో ఈలోకంలోకి వచ్చాడు ధర్మతేజ. గోడకు తగిలించి కన్పించాయి మంజీర వదలిన మువ్వల పట్టీలు.

అందుకున్నాడు.

గట్టిగా కాలికి కట్టుకున్నాడు.

## 3

"ఇది జరిగి ముప్పై నాలుగు సంవత్సరాలైంది." ముగించాడు ధర్మతేజ.

ప్రేమారా తలెత్తి చూసింది నర్తన.

వెండి తీగల్లా తెల్లగా పండిపోయి చెవుల వెనుకగిరిజాలుగా తిరిగిన జుట్టు, పసుపు ముద్దలాటి పచ్చని శరీరం, ముఖంలో బ్రహ్మ తేజస్సు, నుదుట విభూతి రేఖ—మంచు ముద్దలాటి తెల్లటి దుస్తులు.

పండుటాకులాటి ధర్మతేజను చూస్తుంటే గురుభావం ఉవ్వెత్తున పొంగగా, నర్తన శరీరంలో పులకింతతో ఏవో కదలికలు కలిగాయి.

"మాస్టారూ! అలా కృష్ణ వరకూ వెళ్దాం—వస్తారా?" అడిగింది.

అప్పటికే చీకట్లు బాగా కమ్ముకున్నాయి.

విచిత్రంగా చూసి లేచాడు ధర్మతేజ. పెరటి కంచె దాటి ఇద్దరూ కృష్ణవైపు నడక మొదలు పెట్టారు.

ధర్మతేజ మనసు ఉదయం నుంచీ ఉన్న ఆరాటాన్ని పోగొట్టుకుని ప్రశాంతంగాఉంది ఇప్పుడు.

నర్తన మనసులో మంజీర, శివరామశర్మల తాలూకు కలవరం మొదలైంది.

కృష్ణ చేరువైంది. ఇసుక తిన్నెలు దాటి నదీమ తల్లికి దగ్గరగా వచ్చారు.

ధర్మతేజ ఆగాడు.

నర్తన దోసిలితో కృష్ణా జలాలు అందుకుంది. ధర్మతేజ పాదాలపై పోసి నమస్కరిస్తూ, భోరున ఏడ్చేసింది. ★

## కృతజ్ఞతలు

[ శ్రీ నటరాజ రామకృష్ణ 'నృత్య రేఖ', శ్రీ దువ్వూరి జగన్నాథ శర్మ 'భరత నాట్యము' అన్న రెండు చిరుపొత్తాల సహాయం లేనిదే ఈ కథ ఇలా రాయగలిగి ఉండేవాడిని కాదేమో! అందుకే ఆ మహనీయులిద్దరికీ సవినయంతో కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. —రచయిత. ]

